
లారీ టైర్ల కింద నలిగి..
సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తండ్రీకూతురు చక్రాల కింద నలిగిపోయారు. 8లో▸


కమీషన్ చెల్లించాలని..
తమకు ఐదు నెలలుగా కమీషన్ రావడం లేదని మండల పరిధిలోని రేషన్ డీలర్లు వాపోయారు. 8లో▸


ఉరుకులు.. పరుగులు
ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా టీచర్ల హాజరు నమోదు చేస్తుంది. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 130 ఫిర్యాదులు

అనంతగిరి: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 130 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ హార్స్ చౌదరి, డీఆర్‌ఓ మంగ్లీలాల్‌కు వివరిస్తూ అర్జీలు సమర్పించారు.

ఆసరా పెన్షన్లకు ఫేస్ రికగ్నేషన్

పెన్షన్ దారులకు ఫేస్ రికగ్నేషన్‌తో పెన్షన్ పంపిణీ జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 194 మంది బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లను ఎంపిక చేశామని వీరికి మొబైల్ ఫోన్లు అందజేస్తామన్నారు. వీటి ద్వారా ఫేస్ రికగ్నేషన్ ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి


డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పూడూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి నుంచి పూడూరు వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలం కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. అనంతరం పూడూరు డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవి, నాయకులు అనిల్, శ్రీశైలం, ఆంజనేయులు, బుచ్చన్న, ప్రకాశ్ నాయకులు రవీందర్, కృష్ణాచారి, సుభాన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రజక ఫెడరేషన్ ఏర్పాటు చేయండి

రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గోపి


మాట్లాడుతున్న గోపి

పరిగి: రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి తమ కులస్తులకు న్యాయం చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో సంఘం జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.వేయి కోట్లు కేటాయించాలని కోరారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మొగులయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, అనిల్, ప్రభాకర్, వెంకటయ్య, మల్లేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

‘అనంతగిరి హాక్స్’ లోగో ఆవిష్కరణ



టీషర్ట్ ఆవిష్కరిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ అసోసియేషన్ సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతగిరి హాక్స్ టీషర్ట్, లోగోను సోమవారం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుషురాం నాయక్, కార్యదర్శి వినోద్, ప్రతినిధులు నరేందర్, రమేశ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పీఠంపై గురి

- ఖాతా తెరవని కాంగ్రెస్
- కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ కసరత్తు
- పోటీ సిద్ధమవుతున్న నేతల సతీమణులు, వారసులు
- ‘హస్తం’లో అధికంగా ఆశావహులు

ఇప్పటి వరకు టీడీపీ, బీఆర్ఎస్‌లకే అవకాశం



వికారాబాద్: జిల్లా పరిషత్ పీఠం కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్న తరుణంలో ఆశావహులు జెడ్పీ పీఠంపై కన్నేసిన నేతలు ఎవరికి వారు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మండల, జిల్లా పరిషత్‌లు ఏర్పాటైన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో గాని, ప్రస్తుత వికారాబాద్ జిల్లాలో గాని టీడీపీ, బీఆర్ఎస్ జెండాలే ఎగురవేశాయి. అధికార కాంగ్రెస్‌కు ఇప్పటి వరకు జెడ్పీ పీఠం దక్కించుకున్న దాఖలాలు లేవు. వికారాబాద్ హ్యాట్రిక్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా సునీతారెడ్డి తన పదవీకాలం ముగిసే మూడు నెలల ముందు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ మూడు నెలలు మాత్రం పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరినట్లయింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి, శాసన సభ స్పీకర్ జిల్లాకు చెందిన వారే ఉండడంతో పాటు ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండడంతో గెలుపు నల్లేరుపై నడకే కానుందని అధికార పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. ఈ క్రమంలో ఆశావహులు సైతం ఇదే మంచి సమయమని పరిషత్ పీఠం కోసం పోటీ పడుతున్నారు.

‘పట్నం’వారసుడి రంగప్రవేశానికి ప్రయత్నాలు

జిల్లాలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి సానుకూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో ఆ పార్టీలో పోటీ అధికమయింది. ప్రతీ నియోజకవర్గం నుంచి నేతలు పోటీ పడుతున్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఏపదవి లేకుండా ఉన్నారు. ఆమె కూడా మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో అవకాశం కలిసి వస్తే తన కుమారుడిని సైతం జెడ్పీటీసీగా పోటీ చేయించి జిల్లా పరిషత్ గద్దెనెక్కించి రాజకీయ రంగ ప్రవేశం చేయించాలనే యోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వికారాబాద్ నియోజకవర్గం నుంచి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురిని జిల్లా పరిషత్ ఎన్నికల రంగంలోకి దించాలని ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు కోరుతున్నారు. ఇదే నియోజకవర్గానికి రఘువీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి సైతం బరిలో ఉండాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పరిగి, తాండూరు నుంచి పోటీ

పరిగి, తాండూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు సైతం జెడ్పీ పీఠాన్ని ఆశిస్తున్నారు. పరిగి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సతీమణిని పరిషత్ ఎన్నికల రంగంలోకి దింపాలని నియోజకవర్గ కార్యకర్తలు నేతలు కోరుతున్నారు. రామ్మోహన్‌రెడ్డి ఆశీర్వదిస్తే తాము సైతం పరిషత్ బరిలో ఉండేందుకు సిద్ధమని అదే నియోజకవర్గానికి చెందిన బీసీ నేతలు హన్మంత్ ముదిరాజ్, లాల్‌కృష్ణప్రసాద్ పేర్కొంటున్నారు. తాండూరుకు చెందిన పలువురు నేతలు సైతం జిల్లా పరిషత్ పీఠంపై గురిపెట్టారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, రిజర్వేషన్ మహిళలకు కేటాయిస్తే ఆయన సతీమణిని రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదే నియోజకవర్గానికి చెందిన మురళీకృష్ణ తదితరులు సైతం ఆ సీటును ఆశిస్తున్నట్టు సమాచారం.

ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు

జిల్లా పరిషత్ పీఠంను ఆశిస్తున్న నేతలు జిల్లాకు చెందిన ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుని ఆశీస్సులు పొందేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవటంతో పాటు స్థానిక కేడర్ మద్దతును కూడగట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆశావహుల్లో ఎమ్మెల్యేల సతీమణులు, కూతుళ్లు, ఇతర ముఖ్యనేతలు సైతం ఉండటంతో వారు నేరుగా అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. పరిణామాలు, సమీకరణలు, రిజర్వేషన్లు ఎలా ఉన్న జెడ్పీ పీఠం దక్కించుకునేందుకు ముఖ్యమంత్రి ఆశీస్సులు ఈ ఎన్నికల్లో కీలకమని ప్రచారం సాగుతోంది.


అనంతగిరి: వ్యూ టవర్ నుంచి అనంతగిరుల అందాలను వీక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి అభివృద్ధికి కృషి

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

అనంతగిరి: అనంతగిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం పూడూరు పర్యటనకు వచ్చిన ఆయన అక్కడ నుంచి అనంతగిరికి చేరుకున్నారు. అనంతగిరి హరిత రిస్టార్ట్స్, వ్యూటవర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. హరిత హోటల్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశామని కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక చర్యలు తీసుకుని పర్యాటకులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించేలా తీర్చిదిద్దుతారని చెప్పారు. నిరుద్యోగులకు హోటల్ బాధ్యతలు అప్పగించి టూరిస్టులకు మంచి ఆహారం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతగిరి అభివృద్ధితో నిరుద్యోగులకు ఉపాధితో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్నారు. కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని హరిత హోటల్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, టూరిజం ఈడీ ఉపేందర్ రెడ్డి, డీఈ హన్మంత్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పూడూరు: మద్యం తయారీలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కంకల్‌లో ఉన్న బృందావనం స్పిరిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిస్టలరీస్ కంపెనీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తయారీ, విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రజలకు, పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల పరిశీలన అనంతరం బేవరేజ్‌లో లిక్కర్ తయారీ ముడిసరుకు నుంచి బాటిల్ తయారీ వరకు ఆబ్కారీ శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో తెలుసుకున్నారు. మద్యం బాటిళ్ల భర్తీ ప్రక్రియలో లేబులింగ్ విధానాన్ని పరిశీలించారు. మంత్రి వెంట ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ ఉన్నారు.


పూడూరు: మద్యం బాటిళ్లపై లేబులింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి


తాండూరు రూరల్: గోనూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణంలో దూసుకెళ్తున్నాం

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తాండూరు నియోజకవర్గ మొదటి స్థానంలో ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని గోనూరులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించారు. పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాలో తాండూరు మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ శ్రీను, డైరక్టర్ ఉదయ్ భాస్కరెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం ఉన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

యాలాల: మండల పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. రసూల్‌పూర్ నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులను స్థానిక నాయకులతో కలిసి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో తొలగించిన దుకాణాలను పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు

పూడూరు: టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్య క్షుడు ఎ.సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా రీజియన్ అధ్యక్షుడిగా సాయన్న, కార్యదర్శిగా అబ్దుల్ మునీరా రెండో పర్యాయం నియ మితులయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, సత్యం, రాజారెడ్డి, రంగారెడ్డి రీజినల్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చేది లేదు

- తేల్చిచెప్పిన రైతులు
- తిమ్మాపూర్‌లో భూ సేకరణ గ్రామసభ

కందుకూరు: తిమ్మాపూర్ రెవెన్యూలో అసైన్డ్ భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. సర్వే నంబర్లు 38, 162లోని 566.39 ఎకరాల అసైన్డ్ భూములను టీజీఐఐసీ ద్వారా పారిశ్రామిక పార్కుకు సేకరించడానికి గతంలో నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా సోమవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఎకరాకు మూడు రెట్లు అంటే రూ.59.40 లక్షల మేర పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. భూములను ప్రభుత్వానికి ఇచ్చి సహకరించాలని కోరారు. రైతులు మాత్రం ఎన్నో ఏళ్లుగా ఆ భూములనే నమ్ముకుని జీవిస్తున్నామని, ప్రభుత్వానికి ఇస్తే ఉపాధి కోల్పోతామని ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. 20 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను పట్టాగా చేస్తామని గతంలో అధికార పార్టీ ప్రకటించిందని, ఆవిధంగా మార్చాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వారికి తెలిపారు. తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారామ్, నాయబ్ తహసీల్దార్ రాజు, ఆర్ఐ యాదగిరి, టీజీఐఐసీ మేనేజర్ అజీజుసుల్తానా పాల్గొన్నారు.

అయ్యో.. యూరియా

ఆధార్ కార్డుకు ఒక్క బస్తా

- భారీగా క్యూ కట్టిన రైతులు

ధారూరు: యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి వేచి చూస్తే ధారూరు పీఏసీఎస్‌కు సోమవారం 280 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడకి చేరుకున్నారు. సంఘం సిబ్బంది యూరియా పంపిణీకి ఈ పాస్ యంత్రం ఓపెన్ చేయడంతో మొరాయించింది. దీంతో సిబ్బంది కార్యాలయం లోపలే ఉండిపోయారు. ప్రతీ రైతుకు ఒక బస్తా యూరియా, ఒక బాటిల్ లిక్విడ్ నానో యూరియా ఇస్తామని చెప్పడంతో రైతులు ససేమీరా అన్నారు. రైతుల తోపులాట కారణంగా ఒకింత ఉద్రిక్తతత నెలకొంది. విషయం తెలుసుకున్న వ్యవసాయ విస్తరణ అధికారులు సంజూరాథోడ్, సంతోశ్‌లు, ఎస్ఐలు రాఘవేందర్, గోపాల్‌లు అక్కడ చేరుకున్నారు. ఈపాస్ యంత్రం పనిచేయడం లేదని రైతులు సంయమనం పాటించాలని సూచించారు. పోలీసులను చుట్టి ముట్టి యూరియా ఇప్పించాలని పట్టుబట్టారు. చివరకు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి అభ్యర్థన మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాజారత్నం ఆధార్‌కార్డు ద్వారా యూరియా ఇవ్వడానికి ఒప్పుకొన్నారు. వచ్చిన రైతులకు ఒక్కో బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. సరిపడా యూరియా లేక పోవడంతో టోకెన్లు ఇస్తామని చెప్పడంతో రైతులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

పదేళ్లు లేని కొరత ఇప్పుడు ఎందుకు?
బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: పదేళ్లలో లేని యూరియా కొరత కాంగ్రెస్ పాలనలోనే ఎందుకు వచ్చిందో చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులను పక్కదారి పట్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలను గాలికొదిలేసిన రాష్ట్ర మంత్రి వర్గం ఢిల్లీ పర్యటనలు, పాదయాత్రలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. అధికారులతో సమీక్షలు నిర్వహించిన ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన ప్రభుత్వం రైతు సమస్యలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎరువులు, రైతు బంధు క్రమం తప్పకుండా అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్, మాజీ సర్పంచ్‌లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, పి. శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రైతులు తదితరులు ఉన్నారు.


ధారూరు: పీఏసీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు


మోమిన్‌పేట: పీఏసీఎస్ గోదాం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆనంద్

నేత్రోనిలనంతో మహాశక్తి గణపతికి ప్రాణ ప్రతిష్ఠ



ఖైరతాబాద్: శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి విగ్రహానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు కంటి పాపను అమర్చి శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. విగ్రహాన్ని పూర్తిగా మట్టితోనే చేశామని, ఈసారి మహాగణపతిని దర్శించుకునే భక్తులకు అన్ని విఘ్నాలు తొలగిపోవడంతో పాటు విశ్వశాంతి నెలకొనేందుకే విశ్వశాంతి మహాగణపతిగా నామకరణం చేసినట్లు విఠల్ శర్మ సిద్ధాంతి తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతికి సోమవారం సాయంత్రం ఆగమన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేకంగా మరాఠా బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు, తలపాగాలు ధరించి బ్యాండ్ వాయిస్తూ మహాగణపతి ఆగమనానికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో ‘ఉపాధి’ పనులు

- డీఆర్డీఓ శ్రీనివాస్

బంట్వారం: కోట్‌పల్లి మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.9 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు డీఆర్‌డీఓ శ్రీనివాస్ వెల్లడించారు. ఏడాది కాలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల పై పది రోజుల పాటు 18 గ్రామ పంచాయతీల పరిధిలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం కోట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదికలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కోట్‌పల్లి మండలానికి సంబంధించి ఏడాది కాలంలో ఖర్చు చేసిన రూ.9 కోట్లపై సోషల్ ఆడిట్ నిర్వహించామని.. ఇందులో ప్రతీ పైసాకు లెక్క ఉంటుందన్నారు. చేపట్టిన పనులు, ఖర్చు చేసిన డబ్బుకు సంబంధించి ఆడిటర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించారన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పిస్తున్నామన్నారు. కూలీలకు సకాలంలో డబ్బు అందేలా చూడాలని ఆయన ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఆడిటర్లు గ్రామాల వారీగా ప్రజావేదికలో నివేదికలను క్షుణ్ణంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ డానియల్, అంబుడ్స్‌మెన్ రాములు, ఏపీఓ ఎలీషా, ఎస్ఆర్‌పీ ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు, సీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా వేదికలో ఆడిట్ వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

క్లుప్తంగా

రేషన్ కార్డుల జారీలో అవినీతిపై ఫిర్యాదు

తాండూరు: రేషన్ కార్డుల జారీలో రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడ్డారంటూ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు షేక్ ఇర్షాద్ అహ్మద్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీతో పాటు తాండూరు మండలానికి గాను మొత్తం 3,141 కార్డులు మంజూరయ్యాయి. వీరిలో కొంతమంది నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసి అనర్హులకు సైతం కార్డులు జారీ చేశారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 1,000 నుంచి 1,500 మంది అనర్హులు కార్డులు పొందినట్లు ఫిర్యాదులో తెలిపారు. రైతులు బోరుబావికి విద్యుత్ కనెక్షన్ అనుమతి కోసం ఆర్ఐ వద్దకు వెళితే రూ.వెయ్యి తీసుకుని సంతకం పెట్టాడని ఫిర్యాదు చేశారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. నగరంలోని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నివాసంలో మండలానికి చెందిన మెట్లకుంట, బుర్రితండా, మైసమ్మగడ్డతండా, భోజన్నగడ్డతండా నుంచి 70మంది కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ తాలూకా ఉపాధ్యక్షుడు నెహ్రూ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింలు నాయక్, అంజిలయ్య, మాజీ సర్పంచ్ రవినాయక్, ఆలంగౌడ్, సలీం, హరిలాల్‌నాయక్ తదితరులున్నారు.

దర్జాగా ఓవర్ లోడ్!


కరన్‌కోట్ పీఎస్ ముందుకు నుంచి వెళ్తున్న టిప్పర్

తాండూరు రూరల్: తాండూరు మండలంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను కట్టడి చేయడంలో ఆర్టీఏతో పాటు పోలీస్ అధికారులు విఫలమవుతున్నారు. సోమవారం మట్టి తరలిస్తున్న పలు టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ ముందు నుంచి దర్జాగా వెళ్లాయి. ఇది చూసిన స్థానికులు అధికారులు పనితీరుపై మండిపడ్డారు.

సబ్సిడీపై సాగు పరికరాలు

ధారూరు: మండల రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు సరఫరా చేస్తున్నట్లు ఏఓ సూర్యప్రకాశ్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. సబ్ మిషన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ 2025–26లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మహిళ, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై బ్యాటరీ చేతిపంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రొటోవేటర్స్, బ్రష్ కట్టర్స్, కల్టివేటర్, గేజ్‌వీల్స్, ఎంబీప్లగ్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారానికి జతచేసి ఇవ్వాలన్నారు.

లారీ టైర్ల కింద నలిగి తండ్రీకూతురు దుర్మరణం


లారీ చక్రాల కింద రవీందర్


ప్రమాద స్థలంలో కృప


కృప (ఫైల్)


రవీందర్ (ఫైల్)

వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టిన సిమెంట్ ట్యాంకర్

- హాస్టల్ నుంచి కూతురును ఇంటికి తీసుకెళ్తుండగా చేవెళ్ల వద్ద ఘటన
- బీరెల్లిలో విషాదఛాయలు

చేవెళ్ల: సిమెంట్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో తండ్రీకూతురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర రవీందర్(32) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి ఏఎన్ఎంగా పని చేసే భార్య రత్నమ్మ, కూతురు కృప(13), కొడుకు ఉన్నారు. మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట వద్ద కొనసాగుతున్న బంట్వారం ఎస్సీ గురుకుల పాఠశాలలో కృప 7వ తరగతి చదువుతోంది. కూతురుకు జ్వరం వచ్చిందని తెలియడంతో చూసివెళ్లేందుకు రవీందర్ హాస్టల్‌కు వచ్చాడు. బుధవారం వినాయక చవితి కూడా ఉండటంతో అనుమతి తీసుకుని కూతురుతో పాటు ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో చేవెళ్ల వద్ద వెనక నుంచి వచ్చిన సిమెంట్ ట్యాంకర్ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి కింద పడ్డారు. లారీ డ్రైవర్ వాహనాన్ని అలాగే ముందుకు తీసుకెళ్లడంతో చక్రాల కింద నలిగిపోయారు. వెనక టైర్ల కింద పడిపోయిన రవీందర్‌ను చూసి, అక్కడే ఉన్న స్థానికులు పెద్దగా అరిచారు. దీంతో డ్రైవర్ లారీని వెనక్కి తీయడంతో రవీందర్ మృతదేహం చక్రాల పైనున్న ఇనుప రేకుల మధ్య ఇరుక్కుపోయింది. ప్రమాదంలో తండ్రీకూతురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రవీందర్, కృప మృతితో బీరెల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన చేవెళ్లకు బయలుదేరారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

తండ్రిని చంపిన కొడుకుకు రిమాండ్


రిమాండ్‌కు తరలించిన నిందితుడు అజీమ్‌ఖాన్

మొయినాబాద్: మద్యం తాగి పనికి వెళ్లకుండా గొడవలు పెడుతున్నాడనే కారణంతో తండ్రిని కొట్టి చంపిన కొడుకును రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ముర్తూజగూడకు చెందిన మహ్మద్ అజ్జుఖాన్(50) కూలీ పనులుచేసేవాడు. ఈనెల 6న ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, తన వద్ద డబ్బులు తీసుకుని పనికి ఎందుకు రాలేదని అజ్జుఖాన్‌ను అడిగాడు. ఇదే విషయమై అజ్జుఖాన్ భార్య సైతం నిలదీస్తుండగా అక్కడికి వచ్చిన కొడుకు మహ్మద్ అజీమ్‌ఖాన్ తండ్రిపై కోపోద్రిక్తుడయ్యాడు. మద్యం తాగి పనికి వెళ్లకుండా గొడవ పెడుతున్నావంటూ కర్ర తీసుకుని తలపై బాదడంతో అజ్జుఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 14న మృతి చెందాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం నిందితుడు అజీమ్‌ఖాన్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

గృహిణి అదృశ్యం


జయంతి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన చక్రధర్ ఐదేళ్ల క్రితం తన భార్య జయంతి(26)తో కలిసి జీవనోపాధి నిమిత్తం జల్‌పల్లిలోని శ్రీరాం కాలనీకి వలస వచ్చాడు. ఈ నెల 22న ఒడిశాకు వెళ్తానని చెప్పిన జయంతి పుట్టింటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా లాభం లేకపోవడంతో భర్త ఆదివారం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ ముక్త్ భారత్

యాలాల: రెండు వారాల పాటు అధిక దగ్గు ఉంటే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియానాజ్ అన్నారు. సోమవారం మండలంలోని జుంటుపల్లిలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఛాతిలో నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడంలాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీల, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, తుల్జారాం, ఏఎన్ఎం పుణ్యవతి, వనిత, టీబీ సూపర్‌వైజర్ రాహత్, ల్యాబ్ టెక్నీషియన్ భారతి తదితరులు ఉన్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి


రాఘవేందర్ తయారు చేసిన మట్టి విగ్రహాలు


నాగలక్ష్మి తయారు చేసిన మట్టి విగ్రహం

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలనే ఉద్దేశంతో తాండూరుకు చెందిన వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి ఏటా మట్టితో సొంతంగా వినాయక విగ్రహాలను తయారు చేసి ఇంట్లోనే పూజిస్తున్నారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని ఆమె కోరారు.

పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

ధారూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని మండల పరిధి అంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాఘవేందర్ భీష్మించుకున్నారు. అందుకు తగ్గట్లుగానే సొంతంగా మట్టి వినాయక విగ్రహాలను తయారీ చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2015 నుంచి విగ్రహాలు తయారు చేయడం నేర్చుకున్న ఆయన అదే వృత్తిగా ఎంచుకొని ధారూరులో షెడ్డును నిర్మించుకున్నాడు. అందులో చిన్న నుంచి పెద్ద ప్రతిమలను తయారీ చేస్తున్నారు. ప్రస్తుతం జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి.

కమీషన్ చెల్లించాలని డిమాండ్

ఆయా అధికారులకు రేషన్‌డీలర్ల వినతి

కొడంగల్: తమకు ఐదు నెలలుగా కమీషన్ రావడం లేదని మండల పరిధిలోని రేషన్ డీలర్లు వాపోయారు. సోమవారం కడా, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించారు. నెలల తరబడి కమీషన్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రేషన్ డీలర్ల తాలూకా అధ్యక్షుడు కానుకుర్తి నర్సిములు, గౌరవ అధ్యక్షుడు పూరి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 17,200 మంది డీలర్లు ఉన్నట్లు చెప్పారు. ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు మాసాల కమీషన్ రావాల్సి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా పాత పద్ధతిలో చెల్లించాలన్నారు. కిలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తే కమీషన్ రూపంలో రూ.1.40 పైసలు వస్తాయన్నారు. డీలర్లకు రావాల్సిన కమీషన్లను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో 588 రేషన్ దుకాణాలు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వెంటనే విడుదల చేయాలి

తాండూరు టౌన్: గత ఐదు నెలలుగా తమకు రావాల్సిన కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లు తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి నెలా పారదర్శకంగా సన్నబియ్యం పంపిణీ చేశామన్నారు. కానీ ఐదు నెలలుగా మాకు రావాల్సిన కమీషన్‌ను మాత్రం చెల్లించడం లేదన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో పాటు తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు రమేష్ సింగ్, ప్రకాష్, అంజప్ప పాల్గొన్నారు.

కుల్కచర్ల తహసీల్దార్‌కు..

కుల్కచర్ల: తమకు చెల్లించాల్సిన కమీషన్‌ను వెంటనే చెల్లించాలని మండల డీలర్ల సంఘం నాయకులు రతన్, రాములు తదితరులు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, రాజశేఖర్, నర్సింలు, రాము, వేణు, చిన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలలుగా రేషన్ డీలర్లకు ఇవ్వాల్సిన కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా ఇబ్బందులు

యాలాల: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ కమీషన్లను వెంటనే చెల్లించాలని మండల రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వెంకటస్వామికి వినతి పత్రం అందించారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల నుంచి ఆగస్టు నెల వరకు తమకు రావాల్సిన కమీషన్ రాకపోవడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణయ్య, సంగారెడ్డి, సత్యనారాయణ, వెంకటమ్మ, చంద్రయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

దోమలో..

దోమ: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు అందాల్సిన కమీషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు నరేందర్, వెంకటయ్య, చిన్నయ్య, గోవర్ధన్, సత్తయ్య, కృష్ణ, శ్రీను, ప్రకాశ్ పాల్గొన్నారు.


కొడంగల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న డీలర్లు


తాండూరు టౌన్: సబ్ కలెక్టర్‌కు వినతిప్రతం అందజేస్తున్న రేషన్ డీలర్లు


యాలాల: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

పోలీసు నిబంధనలు పాటించాలి

వికారాబాద్ హిందూ ఉత్సవ సమితి

అనంతగిరి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని వికారాబాద్ హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. సోమవారం స్థానిక రామాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసుల నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. ఈ నెల 31న వినాయక నిమజ్జనం, ఏర్పాట్లు తదితర విషయాలపై మండప నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి ప్రతినిధులు మాధవరెడ్డి, కృష్ణ పంతులు, చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, కేపీరాజు, సతీశ్, ప్రశాంత్‌కుమార్, విద్యాసాగర్, గిరధన్ రెడ్డి, శ్రీకాంత్, సత్యనారాయణ, మల్లికార్జున్ గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకుందాం

బొంరాస్‌పేట: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఠాణాలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నేతలు, ఉత్సవ కమిటీ, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. మండపాల ఏర్పాటు, ప్రమాదాల నివారణ, డీజేల రద్దు తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఐ బాలవెంకటరమణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దు

కుల్కచర్ల: హిందూ ముస్లింలు గౌరవభావంతో ఉత్సవాలను, పండగలను నిర్వహించుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి ఆయా పార్టీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.


కుల్కచర్ల: పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేశ్

గొడవలకు పాల్పడితే చర్యలు: ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ యాదగిరి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రజాప్రతినిధులు, మండపాల నిర్వాహకులతో సమావేశం అయ్యారు. కలిసిమెలిసి ఉత్సవాలు నిర్వహించుకోవాలని గొడవలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక మండప వివరాలు పోలీసు వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ రిసీట్‌ను ఠాణాలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ మహేశ్ కుమార్, డీటీ వీరేశ్ బాబు, హకీంపేట్ పంచాయతీ కార్యదర్శి ఆనంద్, కొడంగల్ ఏఎంసీ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మండల ప్రధాన నాయకు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిర్వహించాలి

కొడంగల్: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని సీఐ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు.

బంట్వారంలో..

బంట్వారం: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ధారూరు సీఐ రఘురాములు అన్నారు. సోమవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి ఠాణాల్లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో..

యాలాల: వినాయక చవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద గ్రామస్తులు, యువకులు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని రూరల్ సీఐ నగేష్ అన్నారు. సోమవారం సాయంత్రం పీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండలంలో సుమారు 300 వరకు వినాయక విగ్రహాల ప్రతిష్ఠ ఉంటాయని, ప్రతి గ్రామంలో శాంతియుతంగా పండుగ జరుపుకొనేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయొద్దని వినతి

దౌల్తాబాద్: తమ గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేయొద్దని సోమవారం మండలంలోని పోల్కంపల్లి గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపాన 21 సర్వే నంబరులో ఇప్పటికే పల్లె ప్రకృతివనం, శ్మశాన వాటికలు ఉన్నాయన్నారు. అందుకే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయొద్దని కోరారు. ఈ విషయమై మండల స్థాయి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కలెక్టరు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, అనంతప్ప, వెంకటప్ప, భీమప్ప, సాయప్ప, నవీన్ తదితరులున్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోల్కంపల్లివాసులు

ఆ పాఠశాలను సీజ్ చేయాలి

- డీఈఓ ఆదేశాలున్నా ఎంఈఓ ఎందుకు స్పందించడం లేదు
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


ఎంఈఓ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ఆందోళన

పరిగి: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు పట్టణ కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. అనుమతులు లేకుండానే పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బోధన సాగుతోందని జూలైలో డీఈఓ ఎంఈఓకు ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. నెల రోజులు గడుస్తున్నా ఎంఈఓ ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 9వ తరగతి విద్యార్థులను వేరే పాఠశాలకు బదిలీ చేయాలన్నారు. విద్యార్థుల ఖర్చులను యాజమాన్యమే భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహిపాల్ రెడ్డి, సత్తయ్య, లాలప్ప, రాంచంద్రయ్య, శివ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

సాంగ్ ఆవిష్కరణ

బషీరాబాద్: మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహరెడ్డి ఆడియో సాంగ్ సీడీని సోమవారం విడుదల చేశారు. నల్లగొండ గద్దర్ పాడిన ఈపాట అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు కేశవరెడ్డికి ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు